

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

కిసీకి యాద్‌మే షామే గుజార్నే కేలియే

కలేజా చాహియే ఖుద్కొ మార్నే కే లియే

కె ఘూత్ మౌత్ కె హర్ దిన్ ఉతర్నా పడ్తా హై

యే ఇష్క్ దిల్ మే మెరి జాన్ ఉతర్నేకే లియే

సునా  హై కె ఉన్ కో షికాయత్ బహుత్‌హై

తొఫిర్ ఉన్ కొ హంసె మెహబ్బత్ బహుత్‌హై

'గంగుభాయ్ కథియావాడి' సినిమాలో విషాదగీతంగా ధ్వనించని విషాదగీతం ఇది.  విషాదం సందర్భంలో ఉంటుంది. నాయికా నాయకుడు ప్రేమించుకుంటారు. కానీ తాను నాయకుడిని వివాహం చేసుకోలేదని నాయికకు తెలుసు. అతడికి తానే మరో అమ్మాయితో వివాహం చేస్తుంది. ఆ సందర్భంలో వస్తుంది ఈ పాట. తురాజ్ రాసిన ఈ పాటకు సంజయ్ లీలా భన్సాలీ సంగీత దర్శకత్వం వహించారు. అర్చనా గోరె పాట పాడింది. అయితే తెరపై పాటలో విషాదం అంతగా కనిపించదు. ఆలియా భట్‌కు నటనరాదని ఈ పాటలో ఆమె నటన స్పష్టం చేస్తుంది. తాను ఇష్టపడిన వాడిని తానే మరొకరితో వివాహం చేయిస్తూ ఏమీ పట్టనట్టుగా ఉండటం, నిర్లక్ష్యంగా ఆనందిస్తున్నట్టు కనబడటం అందరికీ చేతకాదు.

ఇలాంటి సందర్భాలు మన సినిమాలలో కోకొల్లలు. దేవదాసుతో ఆరంభించి గంగుభాయ్ వరకూ తనకు ప్రియమైన వారు ఏదో కారణంతో వేరేవారిని పెళ్లి  చేసుకుని వెళ్లిపోతూంటే చక్కని పాటలు పాడారు మన నాయికా నాయకులు. 'మూగ మనసులు' సినిమాలో నాయకుడికి నాయికపై అభిమానం ఉంటుంది. ఆ అభిమానం మాటున దాగిన

ప్రేమ భావనను గ్రహించేంత తెలివి లేదతనికి. నాయిక సైతం పలుకారణాలవల్ల అతనిపై తన భావన స్వరూపాన్ని గ్రహించలేదు. ఈ సందర్భంలో నాయిక వివాహంలో ఉత్సాహంగా పాల్గొంటాడు హీరో. కానీ గుండెల నిండా విషాదం వుంటుంది. పాట పాడతాడు.

**ముద్దబంతి పూవులో మూగ కళ్ల ఊసులో**

**ఎనక జనమ బాసలు ఎందరికీ తెలుసులే...**

ఈ రెండు పంక్తుల గురించి, వాటిల్లో ఒదిగి ఉన్న లోతైన భావనల గురించి ఎంత రాసినా సరిపోదు. ఏ దృష్టితో చూస్తే అలా అర్ధమయ్యే అత్యద్భుతమైన రీతిలో సాగింది రచన.

ఇదే సినిమా హిందీలోకి వెళ్లేసరికి పాటలోని మృదువైన భావన అదృశ్యమైపోయింది. తాత్వికత మాయమైపోయింది. జీవిత సత్యాలు మరుగున పడ్డాయి. సన్నివేశంలో పాత్రల భావనల మృదుత్వం మరుగున పడింది .హిట్ పాట మిగిలింది.

**ముబారక్ హో సబ్‌కో సమాహై సుహానా**

**మైఖుష్ హూ మెరే ఆసువోంపే న జానా**

**మైతొ దీవాన దీవాన దీవానా...**

తెలుగు పాటలోని భావంతో పోలిస్తే 'crass' అన్న పదం మదిలో మెదలుతుంది, హిందీ పాటలో పదాలు, భావాలు తెలుసుకుంటే. వివాహమహోత్సవ శుభ సందర్భంలో అందరికీ శుభాభినందనలు తెలుపుతున్నాడు. నేను పిచ్చివాడిని. నా కంట్లో నీరు చూసి వేరే అనుకోకండి. నేను సంతోషంగా ఉన్నాను అంటున్నాడు.. నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే వస్తాయి, ఏ కన్నీటెనకాల ఏముందో తెలుసుకో అన్న భావానికి పట్టిన గతి ఇది. ముద్దబంతిపూలు, మూగ కళ్ల ఊసులు, ఎనక జనమ బాసలు అన్నీ పోయాయి మిగిలింది హీరో కన్నీళ్లు సంతోషంతో వస్తున్నవి అనటం మాత్రమే. ఇక్కడ హీరో కన్నీళ్లు అనటంతోటే, అతడి మనసులో నాయిక పట్ల ప్రేమ భావన ఉన్నదన్న ఆలోచన వస్తుంది. తెలుగులో అలాంటి సూచన కూడా ఉండదు. ఎనక జనమ బాసలు, మూగకళ్ల ఊసులు అత్యంత సున్నితమూ, మార్మికమైన ఒక అలౌకిక భావనను కలిగిస్తాయి.

'చిల్లరకొట్టు చిట్టెమ్మ' సినిమాలో ఇలాంటి సందర్భం వస్తుంది. నాయిక స్వచ్ఛందంగా నాయకుడికి మరొకరితో వివాహం చేయిస్తుంది దగ్గరుండి. అప్పుడు అతి చక్కటి పాట పాడుతుంది.

**చుక్కల్లో పెద్ద చుక్క చందమామా**

**ఎలుగులకే ఎలుగమ్మ ఎన్నెలమ్మ**

**ఆ చందమామకు ఈ ఎన్నేలమ్మకు**

**చల్లని గోదారి ఒడిలో పెళ్లమ్మా, ముత్యాలజల్లమ్మా...**

దాసం గోపాలకృష్ణ రాసిన ఈ పాటకు రమేష్ నాయుడు సంగీతం కూర్చారు. హిందీలో సజ్జాద్ హుస్సేన్ ఎవరి బాణీని అనుకరించకుండా సంగీతం సృజించాడంటారు. కానీ రమేష్ నాయుడు సృజించిన ప్రతి బాణీ స్వకపోల కల్పితమే. ఎక్కడా ఎవరి ప్రభావమూ  కనబడదు. . ప్రతి బాణీ సుందరమూ, సుమనోహరమూ. ముఖ్యంగా, ఈ చుక్కల్లో పెద్ద చుక్క పాటను తీర్చి దిద్దిన విధానమూ, పాటను నిర్మించిన విధానమూ, వాయిద్యాల వాదకము అమోఘం అనిపిస్తుంది. పాట రెండవ చరణంలో గేయ రచయిత అత్యద్భుతమైన భావం పొదిగాడు.

ఇలాంటిదే 'గంగూభాయి కథయావాడీ'లో పాట కూడా. అయితే గేయ రచయిత పాటను చమత్కారంగా రచించాడు.

ఒకరి జ్ఞాపకాలలో సాయంత్రం అంతా గడపాలంటే, తన అంతరంగాన్ని తానే హత్య చేయాలంటే ఎంతో ధైర్యం కావాలి. హృదయంలో   ప్రేమ భావనను సజీవంగా నిలుపుకోవాలంటే, ప్రతి క్షణం మరణిస్తూ ఉండాలి. అతనికి నాపై చాలా ఫిర్యాదులున్నాయని విన్నాను. దీని అర్థం అతనికి నాపై ప్రేమ ఉందన్నమాట. ఇదీ పాట ఆరంభం.

సందర్భాన్ని అనుసరించి చూస్తే ఇద్దరూ ప్రేమించుకున్నారు. కానీ ఆమె తన ప్రేమను ఆయుధంలా వాడి అతడి వివాహం మరొకరితో చేసింది. అతడికి ఆమె పై ప్రేమ ఉంది. దాన్ని చంపుకుని అతడు మరొకరిని వివాహం చేసుకున్నాడు. తనని బలవంతపెట్టి మరీ మరొకరితో దగ్గరుండి వివాహం చేయించింది. ఇది అతని ఫిర్యాదు. ఫిర్యాదు చేస్తున్నాడంటే ప్రేమ ఉన్నట్టే అంటోంది. ఇక్కడ ఆమె పరిస్థితి చూస్తే, అతనిపై ప్రేమను ఆమెకూడా అణచిపెట్టింది. కానీ జ్ఞాపకాలు పోవు కదా! వాటితో బ్రతకాలంటే తన అంతరంగాన్ని తాను చంపుకోవాలి. ఎందుకంటే, అతడిని

తలవకూడదని కదా మరొకరితో వివాహం చేసింది. ఇలాంటి జటిలమైన మానసిక సమస్యను 'షికాయత్ ', ఫిర్యాదు, అన్న పదం ఆధారంగా ప్రదర్శిస్తూ అతి చక్కగా రచించిన పాట ఇది. మామూలు పాటలకన్నా భిన్నంగా ఈ పాటను నిలిపింది ఈ పాట రచన పద్ధతి. బాణీ పాతదే. చిత్రీకరణ అస్సలు బాగోదు. ఆలియా భట్‌కు ఉత్తమ నటనకు అవార్డు వచ్చుండవచ్చుగాక. కానీ ఆమెకు నటన రాదన్నది నిర్వివాదాంశం. నటన తెలిసి ఉన్న నటి ఈ పాత్రను పోషిస్తే ఈ సినిమా మరపురాని సినిమాగా నిలిచి ఉండేది. అందుకే మనసులో దుర్భరమైన వేదనను కలిగించే శక్తికల ఈ పాట అంతగా ఎవరి దృష్టిని ఆకర్షించలేదు.

సునాహై కి వో తోడ్ దేతే హై దిల్ తో

హమే టూట్నే కీ భి అదత్ బహుత్ హై

అతడికి హృదయాలను విరిచే అలవాటు ఉందని విన్నాను. నాకు విరిగే అలవాటు వుంది. రెండు వైపులా పదునైన కత్తిలాంటి భావం ఇది. నాయిక వైపు నుంచి చూస్తే ఒక అర్థం, నాయకుడి వైపు నుంచి చూస్తే మరో అర్థం వస్తుంది. అతడికి హృదయాలను విరిచే అలవాటుంది. ఆమెకు హృదయం పగుల గొట్టుకునే అలవాటుంది. ఆమె వేశ్య. ఎవరినీ ప్రేమించలేదు. హృదయాలను విరిచే అలవాటు ఆమెకుంటుంది. ఇలా పలురకాల వ్యాఖ్యలకు తావిచ్చే రీతిలో రచించాడు పాటను.

**ఉలకని పలకని మూగరాలివని తెలిసే అందరూ వస్తారు.**

**కోరినవన్నీ అవుతాయనుకొని గుండె నింపుకోని వెళతారు**

**మౌనంగా ఎన్నాళ్లు ఉంటావోయమ్మ**

**మనసారా ఈసారైనా దీవించవమ్మా...**

ఇలాంటి భావాలను ఇంత సరళమైన పదాలలో ఒదిగించాలంటే రచయిత మనసు ఎంతో సున్నితమైనదై ఉండాలి. అద్భుతమైన గేయ రచన ఇది. ఇలాంటి సందర్భం 'ధర్తీ కహే పుకార్‌కే' అని సినిమాలో ఉంటుంది. అప్పుడు ముకేష్ స్వరంలో మజ్రూహ్ రాసిన భావాత్మకమైన గీతాన్ని లక్ష్మీకాంత్ ప్యారేలాల్ బాణీలో జితేంద్ర పాడతాడు.

ఖుషీ కే వొ రాత్ ఆగయీ

కొయీ గీత్ జగ్‌నేదో

గావో రే ఝూమ్ ఝూమ్

'సంతోషం, సంబరాలతో నిండిన రాత్రి వచ్చింది. ఆనందిస్తూ పాట పాడండీ అంటున్నాడు. కానీ ఆనందంలో విషాదం దాగుందని తెలుస్తూంటూంది చరణంలో. ఈ రోజు ఎంతగా నవ్వుతానంటే కళ్లల్లో నీళ్లు వస్తాయి. ఎంతగా పాడతానంటే హృదయంలో బాధ కలిగేంత, ఆనందంతో తెల్లారి వరకూ పాడుతూనే ఉంటాను అంటాడు. అసలు విషయం రెండో చరణంలో చెప్తాడు.

ధూల్ హు మై వో పవన్ బసంతి

క్యు మెర సంగ్ ధరె

మెరి నహీతో ఔర్ కిసీకే పయ్యా మె రంగ్ భరే

దో నైనోమే అసూలియే, దుల్హనియాకో సజ్నేదో..

నేను ధూళి కణాన్ని, ఆమె వసంతనాటి పవనం. ఆమె నాతో ఎలా కలుస్తుంది? నాది కాకపోయినా, ఎవరో ఒకరి పారాణి అవుతుంది. కళ్లల్లో నిండే నీళ్లతో పెళ్లి కూతురిని అలంకరించుకోలేనీ.. ఆనందంగా నృత్యం చేద్దాం అంటున్నాడు హీరో.

నజర్ భర్ కె వో దేఖ్తే భీ నహీహై

హమారే లియే సోచ్తేభీ నహీహై

గుజార్తే హై రోజ్ పెహ్లూసే ఉన్‌కే

మగర్ వో హంకో రోక్తే భీ నహీహై

సునా హైకి నఫ్రత్ వో కర్తే హై హమ్  సే

హమే  ఉన్‌కి నఫ్రత్‌సే రాహత్ బహుత్‌హై

అద్భుతమైన రచన పద్ధతి ఇది. ఈ వైపు ఫిర్యాదు చేస్తున్నట్టుంటుంది. ఆ ఫిర్యాదులో అంతర్లీనంగా అనంతమైన దుఃఖసాగరాల అలలు ఎగసెగసి పడుతూంటాయి.  నన్ను కళ్లెత్తి చూడడు. సరిగ్గా చూడడు. నా గురించి ఆలోచించడు. అతడికి దగ్గిరగా వెళ్తూంటే నన్ను ఆపడు. నన్ను అతడు తీవ్రంగా ద్వేషిస్తున్నాడని విన్నాను. అతని ద్వేషం నాకు ఎంతో సాంత్వననిస్తుంది. ఎందుకంటే, అతను ద్వేషిస్తున్నాడంటే, నన్ను ఇంకా  మరచిపోలేదని, ఇంకా ప్రేమిస్తున్నాడని అర్ధం. ఎంతో గొప్పగా అనిపించే భావం ప్రేమలో ఒక ఉన్నతమైన తీవ్రమైన స్థాయికి చేరుకోవటాన్ని సూచిస్తుంది.

షహర్ చాహే జీవన్‌కా, వీరానా కర్‌దో

మగర్ దేఖ్‌కర్ హమ్కో  హైరాన్ కర్‌దో

భరమ్  ఆజ్ భీ హై వఫావోంకే  హమ్కో

ఇజాజత్ హై జానా ఖతావోంకి తుమ్కో

ఖతా పర్ భి ఉన్‌కీ ఖఫా హమ్  నహీహై

కిసీ హాల్ మే భీ జుదా హమ్ నహీ హై

నో ఇల్జామ్ జిత్నే భీ చాహే లగాలే

వఫాదర్ హై బేవఫా హమ్  నహీహై

సునాహై కి లోగ్  భూల్ జాతే  హై మిల్‌కర్

హమే  ఉన్‌కి యాదోంకి దౌలత్ బహుత్ హై

చివరి వాక్యం 'పంచ్‌లైన్ ' వెంటాడే వాక్యం నా జీవితమనే నగరాన్ని సర్వనాశనం చెయ్యి. కానీ ఒక్కసారి నావైపు చూసి నన్ను ఆశ్చర్యపరచు. ఇప్పటికే నీ పట్ల నమ్మకం ఉంది. కానీ తప్పులు చేసేందుకు నీకు అనుమతి ఉంది. నీ పొరపాట్లు నేను పట్టించుకోను. ఎట్టి పరిస్థితులలో మనం వేరుకాదు. అతను ఎంత కావలంటే అంతగా నన్ను తప్పుపట్టవచ్చు. దూషించవచ్చు. నేను మోసగత్తెను కాను. విశ్వాసపాత్రురాలిని . అతను కలసి మరచిపోతాడని విన్నాను. కానీ అతని జ్ఞాపకాల నిధి నాదగ్గర ఉంది. 'యాదోంకి దౌలత్ '.. జ్ఞాపకాల నిధి, జ్ఞాపకాల ఆస్తి, ఐశ్వర్యం అంటే, అతను ఎలా ప్రవర్తించినా, ఎంతగా దూషించినా, ద్వేషించినా, ఆమెని తలవకున్నా ఆమె అతని జ్ఞాపకాలలో బ్రతుకుతుందన్నమాట. అతని జ్ఞాపకాలలో బ్రతకాలంటే ప్రతిక్షణం తనని తాను చంపుకోవటం, ప్రతిక్షణం చావటం అన్న మొదటి చరణంలోని భావంతో అన్వయించుకుంటే మనసు కరిగి నీరైపోయే విషాద భావన కలుగుతుంది. అంటే, ఆమె ప్రతిక్షణం తనని తాను చంపుకుంటూ, అతని జ్ఞాపకాలలో బ్రతుకుతోంది. కానీ అతనికి ఆమెపై బోలెడన్ని ఫిర్యాదులున్నాయి. అతడు ఫిర్యాదులు చేసినంతకాలం, అతనికి తనపై ప్రేమ భావంపోలేదని సంతోషిస్తూ, అతని జ్ఞాపకాలలో ఆమె బ్రతుకుతోంది. ఇదీ పాటంటే.

అయితే, పాటను ఖవ్వాలీలా మలచి, చెత్తగా చిత్రీకరించి మధ్య మధ్యలో నటన రాని అలియాభట్ ఓవర్ ఏక్షన్ చేయాలని ప్రయత్నిస్తూంటే పాట ప్రభావం తగ్గుతుంది. విడిగా వింటే, భావాల్ని అనుభవిస్తే కలిగే ఆనందం వేరు. ఇటీవలి కాలంలో విషాదగీతాలు అరుదయి పోయాయని వ్యాఖ్యానించేవారు ఇప్పటి పాటలు వినటంలేదు. లేదు. విన్నా అర్థం కావటంలేదు అనుకోవచ్చు. ఇప్పటి సినిమాల్లో విషాదాన్ని ప్రదర్శించే పద్ధతి మారింది.

{వచ్చే నెల మరిన్ని మధుర గీతాలతో}

Click here to share your comments